www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 14 జూన్ 2023

5

తిరుపతి



శ్రీవారి సేవలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్

ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి అనుగ్రహంతో భారతదేశం అన్నివిధాల అభివృద్ధి చెందాలని, స్వామివారిని ప్రార్థించినట్లు, కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద టిటిడి అధికారులు స్వాగతం పలికే దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలుకుగా, అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశానికి మరింత సేవచేసే భాగ్యం తనకు కల్పించాలని, దేశ ప్రజలకు స్వామి ఆశీస్సులు ఉండాలని తెలిపారు.

మోడీ విధానాలకు నిరసనగా

జులై 18న ఢిల్లీలో జాతీయ సదస్సు

సిఐటియు జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ హేమలత

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, విద్యుత్ రంగాలను ప్రైవేటీకరణ పేరుతో అమ్మకానికి పెట్టడాన్ని నిరసిస్తూ జూలై 18వ తేదీన ఢిల్లీలోని హరి కిషన్‌సింగ్ సూర్జిత్ భవన్‌లో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్టు సిఐటియు అఖిలభారత అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత ప్రకటించారు. తిరుపతిలో జరుగుతున్న సిఐటియు రాష్ట్రకమిటీ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా డాక్టర్ హేమలత మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తాజాగా రైల్వేరంగాన్ని అమ్మకానికి పెట్టిందని, విద్యుత్ రంగంలో సమాజానికి దుష్పరిణామాలు కలిగించే విధంగా అమ్మకానికి పెట్టటాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాలకు సిఐటియు పిలుపునిచ్చిందని వివరించారు. జూలై 18 తర్వాత దేశవ్యాప్తంగా దశల వారీ ప్రచార కార్యక్రమాలను చేపట్టి ఆగస్టు 9 నుంచి 14వ తేదీ వరకు దేశంలోని అన్ని జిల్లాలలో కనీసంగా రెండు రోజుల నుంచి వారం రోజుల వరకు ధర్నాల నిర్వహణకు పిలుపునిస్తున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమం జయప్రదం కోసం వివిధ జాతీయ కార్మిక సంఘాలను సంప్రదిస్తున్నామని తెలిపారు. దేశంలో మతం పేరుతో ఉద్రిక్తతలను రెచ్చగొట్టి దాని నుంచి లబ్ది పొందాలనుకున్న బిజెపి ప్రయత్నాలు విఫలమవుతున్నాయని, తాజాగా కర్ణాటక ఫలితాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. బిజెపి విధానాలను అడ్డుకోకుంటే ప్రభుత్వ రంగం దేశంలో అదశ్యం అవుతుందని ఆమె హెచ్చరించారు. అన్ని స్థాయిలలోని కార్మికులు, కష్టజీవులు ఒక్కటై ప్రభుత్వ విధానాలపై పెద్దఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ప్రసంగిస్తూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు ద్రోహం చేసిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికలకు ముందు రెగ్యులరైజ్ చేస్తానని చెప్పి ఇప్పుడు కుంటిసాకులు చెబుతున్నారని ఉద్యోగ ఖాళీలు లేవని అంటున్నారని, వేతనాలు పెంచకుండా, ఉద్యోగ భద్రత కల్పించకుండా, చట్టాల స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు ద్రోహం చేసిందని విమర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో అటవీ కార్మికులు 950 రోజులుగా రిలేనిరాహార దీక్షలు చేస్తుంటే పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. ఈ సమస్యలన్నింటిపై జూన్ 18వ తేదీన విజయవాడలో రాష్ట్రస్థాయిలో సదస్సును నిర్వహించి కార్యాచరణ ప్రకటిస్తామని నర్సింగరావు తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల ప్రచారజాతకు అపూర్వమైన స్పందన లభించిందని తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఇతర సంఘాలతో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. అంగన్ వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని, పోరాడుతుంటే నిర్బంధానికి పూనుకుంటున్నారని, కనీసం ప్రజాస్వామ్యయుతంగా చర్చలకు రావడంలేదని, దీనిని సహిస్తూ ఊరుకునే ప్రశ్నలేదని నర్సింగరావు హెచ్చరించారు. అంగన్వాడీలకు జరుగుతున్న అన్యాయంపై ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున పోరాటానికి సిఐటియు పూనుకుంటుందని హెచ్చరించారు. తక్షణం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కార్మిక సమస్యలపై చర్చించటానికి అఖిలపక్ష కార్మిక సంఘాలను పిలవాలని, తాము చెప్పే సమస్యలను ఆలకించాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్ద కాలానికి పైగా కనీస వేతనం పెంచకుండా 70కి పైగా షెడ్యూల్డ్ పరిశ్రమల్లోని లక్షలాది మంది కార్మికులకు ప్రభుత్వం నష్టం చేసిందని వివరించారు. పోలవరం నిర్వాసితులకు మద్దతుగా జరిగే పాదయాత్రకి సిఐటియు సంఘీభావం ప్రకటిస్తున్నదని ప్రకటించారు. జూన్ 14వ తేదీన ప్రపంచ రక్తదాన దినాన్ని పురస్కరించుకొని అన్ని జిల్లాల్లో సిఐటియు కార్యకర్తలు రక్తదానం చేస్తారని ప్రకటించారు. జూన్, జూలై నెలలలో శ్రామిక మహిళా సమస్యలపై అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహించనున్నట్టు ప్రకటించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ పోరాటానికి మద్దతుగా రాష్ట్రంలో గుంటూరు, నరసరావుపేటలలో రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం జూలై 10న అన్ని కలెక్టరేట్ల వద్ద జరిగే అంగన్వాడీల ధర్నాలకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నదని తెలిపారు. ఈ సమావేశానికి సిఐటియు రాష్ట్ర నాయకులు ఏవి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.

హాజరైన ప్రతినిధులు

సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో...

నూతన మెనూను అమలు చేయాలి

మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా అమలు చేయబడుతున్న వివిధ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నూతన మెనూను సక్రమంగా అమలు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక పద్మావతి అతిథి గహం తిరుపతిలో చిత్తూరు, తిరుపతి జిల్లాల సాంఘిక సంక్షేమ, సాధికార అధికారులు, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, ఈడి ఎస్సీ కార్పొరేషన్, జిల్లా కోఆర్డినేటర్ గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్‌లతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీలకు అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు సాంఘిక సంక్షేమ అధికారుల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వసతి గహాల నిర్వహణ, పరీక్ష ఫలితాలపై, కళాశాలల హాస్టల్స్ నిర్వహణ మొదలైన అంశాలపై సమీక్షించారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశలో ఇప్పటినుండే ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని సంక్షేమ అధికారులకు సూచించారు. కళాశాలల వసతి గహాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వసతి గహ అధికారులు వారి వసతి గహం వద్దనే నివాసం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. నూతన మెనూను సక్రమంగా అమలు చేయాలని అధికారులు వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కళాశాలల వసతి గహాల లోని కళాశాల విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేలా పోలీసుల సహకారంతో కౌన్సిలింగ్ నిర్వహించి వారు పెడదారిన పట్టకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు చెన్నయ్య, రాజ్యలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నర్సింహులు, గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ జయభారతి పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

తిరుమలలో పెరిగిన రద్దీ

- సర్వ దర్శనానికి 24 గంటలు - 31 కంపార్ట్‌మెంట్లలో భక్తులు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో యాత్రికుల సంఖ్య పెరగడంతో స్వామివారి హుండీ ఆదాయం పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులతో 31 కంపార్ట్‌మెంట్లు నిండిపోగా టోకెన్లు లేని యాత్రికులకు 24 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని ఆలయ అధికారులు వెల్లడించారు. సోమవారం స్వామివారిని 79,087మంది యాత్రికులు దర్శించుకోగా 35,640మంది తలనీలాలు సమర్పించుకున్నారు. యాత్రికులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.4.41కోట్లు వచ్చిందని వివరించారు. లోక శ్రేయస్సు కోరుతూ తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలోని మైదానంలో జూన్ 29వ తేదీ నుంచి జూలై 5వ తేదీ వరకు శ్రీనివాస చతుర్వేద హవనం నిర్వహిస్తున్నట్లు జేఈవో సదా భార్గవి తెలిపారు. తిరుపతిలో తొలిసారి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని విభాగాలు సమన్వయం తో పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. దాదాపు 30 నుంచి 35మంది రుత్వికులు చత్రుర్వేద హవనం నిర్వహణలో పాల్గొంటారని చెప్పారు. హోమ నిర్వహణకు అవసరమయ్యే ద్రవ్యాలు ముందే సిద్ధం చేసుకోవాలన్నారు. వేదిక నిర్మాణం పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. గార్డెన్ విభాగం పుష్పాలంకరణలు, విద్యుత్ విభాగం విద్యుత్ అలంకరణలు ఆకట్టుకునేలా ఉండాలని ఆదేశించారు. సాయంత్రం వేళల్లో యాత్రికులకోసం వేద ప్రవచనాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

వ్యవసాయ కళాశాల కాంట్రాక్ట్ కార్మికుల

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి వ్యవసాయ కళాశాల కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ చర్చిస్తున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరావు, ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ వర్కర్స్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కోటేశ్వరరావులతో స్థానిక నాయకులు విన్నవించుకున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వంతో వర్సిటీ అధికారులతో చర్చించాలని సూచించారు. ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్, కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన సమస్య పరిష్కరించాలని టిడిపి...

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: నియోజకవర్గంలోని తిమ్మినాయుడుపాళెం హరిజనవాడ శ్మశానవాటిక స్థలవివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటనలో దళితులు గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని మంగళవారం టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మలు పరామర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డిని కలిసి శ్మశాన స్థలవివాదాన్ని పరిష్కరించాల్సిందిగా పూర్తి సమాచారంతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే ఇరువర్గాల వారు అక్రమకేసులు బనాయించుకోకుండా సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఆర్‌డిఓ, ఎంఆర్‌ఓలతో సంప్రదించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతి అందించిన వారిలో సూరా సుధాకర్‌రెడ్డి, మునిక్రిష్ణ, రజనీకాంత్ నాయుడు, యశ్వంత్ రెడ్డి, కరాటే చంద్ర, షేక్ ఖాజా, దినేష్ ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

రోడ్డు ప్రమాదాల నివారణపై సమీక్ష

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి సిటి: ప్రజలు, వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా ఎస్పి పరమేశ్వర్‌రెడ్డి మగళవారం సమీక్ష నిర్వహించారు. స్థానిక పోలీసు అతిథిగృహం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిర్లక్ష్య ధోరణి తగదని అన్నారు. రోడ్డుపైకి వచ్చే ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన పెంచుకుని పద్ధతిగా నడుచుకోవాలని, ఫుట్‌పాత్‌లపై అక్రమాలు చేసుకుని ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై కేసులు కూడా నమోదు చేయాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి సిసి కెమెరాల ద్వారా త్రిబుల్ రైడింగ్, ర్యాష్ రైడింగ్, వన్‌వే వాటిని గుర్తించి ఈ-చలానా వేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే వారిని ఉపేక్షించ రాదనీ అన్నారు. పోలీస్ సిబ్బంది కూడా విధులల్లో సెల్‌ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడరాదనీ, అవసరమైతే తప్ప సెల్‌ఫోన్‌లను వాడరాదని, నామమాత్రపు విధులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌సి రోడ్, అవిలాల 150 బైపాస్, రామానుజపల్లి చెక్‌పోస్ట్, తనపల్లిక్రాస్, ప్రాంతాలలో ట్రాఫిక్ నివారణకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీనివాస సేతు పై ఓవర్ బ్రిడ్జిపై యువత ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తున్నారని, అలాంటి చర్యలను కూడా పూర్తిగా నివారించాలని ఆదేశించారు. నగరంలోని వాణిజ్య సముదాయాలు, షాపింగ్ మాల్స్ ప్రాంతాలలో పార్కింగ్‌ను క్రమబద్ధీకరించాలని, యాజమాన్యంతో మాట్లాడి తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. అవగాహనా రాహిత్యం వల్ల యువత చెడు అలవాట్లకు ప్రాధాన్యత ఎక్కువ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యపానం తాగి వాహనాలు నడిపేవారిపై కఠినంగా వ్యవహరించాలని, అలాంటి వారిని గుర్తించి ఇంటింటికి పోయి విచారించి, వారి తల్లిదండ్రులకు కూడా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఇకపై రోడ్డుపైకి వచ్చే ప్రతి ఒక్కరూ నిబంధనలు తప్పకుండా పాటించే విధంగా చర్యలు తీసుకునే బాధ్యత పోలీస్ వారిపై ఉందని అధికారులకు సూచించారు. కొన్ని చోట్ల జాతీయరహదారుల విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నందువల్ల జాతీయ రహదారుల జాతీయ రహదారుల అధికారులతో సమన్వయం పరచుకుంటూ అవసరమైన ప్రతి చోట సూచిక బోర్డులను ఏర్పాటు చేసి రోడ్డుప్రమాదాల నివారణకు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుపతి నగరంలో ఉన్న ప్రజలకు, టాక్సీలు, ఆటోడ్రైవర్లకు, వాహనదారులకు ట్రాఫిక్ నియమ నిబంధనపై అవగాహన ఉండాలన్నారు.

తిరుమల ఘాట్ రోడ్డులలో ప్రమాదాల నివారణ కొరకు ప్రతి మలుపు వద్ద సిసి కెమెరాలు, ప్రమాదపు హెచ్చరిక బోర్డులు టిటిడి వారి సహకారంతో ఏర్పాటు చేయడానికి కార్యాచరణపై ఆలోచిస్తున్నామని అన్నారు. ఇలా చేయడం వలన మలుపుల వద్ద ప్రమాదాలు తగ్గడానికి పూర్తి ఆస్కారం ఉంటుందని తెలిపారు. డౌన్ ఘాట్‌లో వాహనాలు దిగే సమయంలో పూర్తిగా బ్రేక్‌ల పైనే రావడం వల్ల బ్రేక్ డ్రంలు ఒత్తిడికి గురై పూర్తిస్థాయిలో బ్రేకులు పడనందు వలన కొంతమేర ప్రమాదాలు జరిగే ఆస్కారం కూడా ఉందని ప్రాథమిక విచారణలో తెలుసుకున్నామని తెలిపారు. దీనిపై టిటిడి ఉన్నతాధికారులతో పూర్తిస్థాయిలో చర్చించి ఘాట్‌రోడ్ ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల కుమారి, మునిరామయ్య, డీఎస్పీలు నరసప్ప, కొండయ్య, సిఐలు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, డిసిఆర్‌బి చంద్రశేఖర్ పిళ్ళై, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఇంటర్నల్ రోడ్లకు ప్రాధాన్యత

డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరంలోని ఇంటర్నల్ రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి అధికారులకు సూచించారు. తిరుపతి లక్ష్మీపురం సర్కిల్‌లోని యుడిసి, ఓల్డ్ తిరుచానూరు రోడ్డులో బిటి రోడ్డు, ఎస్‌జిఎస్ కాలేజీ ఇంటర్నల్ రోడ్డు పనులను డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె.బాబుతో కలిసి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ మాస్టర్‌ప్లాన్ రోడ్లకు ఎటువంటి ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేశామో, అదేవిధంగా ఇంటర్నల్ రోడ్లకు అంతే ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేస్తున్నామని అన్నారు. రోడ్లను నాణ్యత ఉండేవిధంగా వేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశానుసారం తిరుపతి నగరాన్ని అభివద్ధి దిశగా తీసుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోటూరు అంజినేయులు, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి, అంకాలమ్మ గుడి చైర్మన్ లక్ష్మయ్య, ఎస్‌కె.జానీ, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డీఈ సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నల్ రోడ్లు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి

గిరిజనుల భూములపై

ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం

అడ్డుకున్న గిరిజనులు, ప్రజాసంఘాలు

ప్రజాశక్తి- పెళ్ళకూరు: గిరిజన భూములపై ఫారెస్ట్ అధికారులు చేస్తున్న దౌర్జన్యాలను అడ్డుకోవడంతో పాటు మొక్కలు తొలగిస్తున్న హిటాచిని గిరిజనులు, ప్రజాసంఘాల నాయకులు అడ్డుకున్నారు. మండలంలోని కానూరు రాజుపాలెం గ్రామపంచాయతీ ఎగువ కానూరు గిరిజన కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సుమారు 45 కుటుంబాల వారు గత 40ఏళ్లుగా సర్వేనెంబర్ 91లోని 50 ఎకరాల పొలాన్ని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. 91 సర్వే నంబర్‌లో 1044 ఎకరాల 44 సెంట్లు భూమి ఉందని, ఈ సర్వే నెంబర్‌లో 1983 సంవత్సరానికి ముందు కాలనీ నిర్మించి ఉన్నారని తెలిపారు. 2009 సంవత్సరంలో వంద ఎకరాల భూమిని క్వారీకి అనుమతులు ఇవ్వడంతో క్వారీ కొనసాగుతోందని, మరికొంద మంది పేద రైతులు కొంత భూమిని సాగు చేసుకుంటూ పంటలు పండిచుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. ఈమొత్తం విస్తీర్ణంలో 634 ఎకరాలు మాత్రమే ఫారెస్ట్ వారికి కేటాయించినవి అని, ఫారెస్ట్ వారికి కేటాయించిన భూమి ఎక్కడ వరకు ఉందో నిర్ణీత హద్దులు నిర్ణయించకుండా పూర్తి విస్తీర్ణంలో ఈ ప్రాంతంలోని గిరిజనుల సాగును అడ్డుకోవడం దారుణమన్నారు. అటవీ ప్రాంతమే జీవనాధారంగా బతుకుతున్న గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యం చేయడం సిగ్గుచేటని అన్నారు. గిరిజనుల జీవనోపాధిని దెబ్బతీసేలా దౌర్జన్యానికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. గిరిజనులకు న్యాయం జరిగేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం డిఆర్‌ఓ కోటేశ్వరరావుతో గిరిజనుల సమస్యపై మాట్లాడారు. గిరిజనుల సమస్యలను ఎంఆర్‌ఓని కలిసి వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పి.గురవయ్య, నాయకులు ఎస్.ముకుంద, గిరిజనులు పాల్గొన్నారు.

ఎస్వీ శిల్ప కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- తిరుపతి సిటి: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర సాంప్రదాయ ఆలయ శిల్ప కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి గాను సాంప్రదాయ కళంకారి కళలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో జూలై 10వ తేదీ వరకు దరఖాస్తులు పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను జూలై 15వ తేదీ సాయంత్రంలోపు కళాశాలలో సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 4 సంవత్సరాల డిప్లొమా, 2 సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సులో చేరదలచిన విద్యార్థులు కోర్సుల విద్యార్హతలు, ఇతర వివరాల కోసం టిటిడి వెబ్‌సైట్‌ను గానీ, కళాశాల కార్యాలయాన్ని 0877- 2264637, 98669 97290ను సంప్రదించాలని కోరారు.

ఉత్తమ ఫలితాల సాధనకు శ్రీవిజ్ఞాన్ హైస్కూల్

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ
- లీడ్‌ప్రోగ్రామ్ ద్వారా ఆధునాతన విద్యాబోధన
- విశాలమైన తరగతి గదులు

ప్రజాశక్తి- తిరుపతి సిటి: విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు శ్రీవిజ్ఞాన హైస్కూల్ ఉత్తమమని ఆ స్కూల్ కరస్పాండెంట్ ఏ.జనార్ధన్ నాయుడు తెలిపారు. స్థానిక ఎస్‌టివి నగర్‌లోని ఆ స్కూల్ ప్రాంగాణంలో 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ శ్రీవిజ్ఞాన్ హైస్కూల్ భవ్యమైన భవిష్యత్తుకు ప్రత్యేక్ష సాక్ష్యమని, అందుకు ఎస్ఎస్‌సి 2023 పబ్లిక్ పరీక్షల్లో మా విద్యార్థులు సాధించిన ఫలితాలకే నిదర్శనమన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులతకు ఎన్.జోష్నా 545/600, కె.మైత్రి 535, బి.తరుణ్ 518, ఎం.వరున్ తేజ 514, వై.సంతోష్ 510, బి.దేవశ్రీ 472, ఎం.రోస్‌మేరీ 460, పి.కార్తీక్ 415, టికె.మురళీ 385, టి.మునిశ్వర్ 379, ఎస్.సాదిక్ వల్లీ 329, ఎఎస్.హేమంత్ కుమార్ 312మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, విశాలమైన ప్రాంగాణంలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు అన్ని విధాలుగా అనుకూలమైన ప్రదేశంలో స్కూల్‌ను ఏర్పాటు చేశామన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని, వివరాలకు 9441950036, 7780385006 ఫోన్ నెంబరును సంప్రదించాలన్నారు.

ప్రత్యేకతలు

- సీనియర్ ఉపాధ్యాయులచే బోధన.
- విద్యార్థులకు ఒత్తిడిలేని విద్య
- ఉచిత స్టడీ అవర్స్ నిర్వహణ
- మినరల్ వాటర్ సౌకర్యం



ఏ.జనార్ధన్ నాయుడు
స్కూల్ కరస్పాండెంట్

- స్మార్ట్ టీవీ ద్వారా ఆడియో, వీడియో లెసన్స్
- యాక్టివిటీ ఆధారిత బోధన
- ఇంటి వాతావరణాన్ని కలిగిన హాస్టల్ సౌకర్యం
- ఆధునాతన పరికరాలు కలిగిన సైన్స్ ల్యాబ్
- కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యం
- అత్యుత్తమ ఫలితాల సాధన

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు



లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కోట: ఉమ్మడి నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని కదిరినాయుడుపల్లికి మంగళవారం చేరుకుంటున్న లోకేష్ పాదయాత్రలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూపిలి రాధాకష్ణారెడ్డి పిలుపునిచ్చారు. యువగలం పాదయాత్రకు ప్రజల మద్దతిస్తుండటం చూసి వైసీపీ నాయకుల్లో భయం వేస్తోందని.. ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు.

ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పుత్తూరు ఏపీఎస్‌ఆర్టీసీ డిపోలో గతనెల విధి నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన డ్రైవర్లు ఏసీ ప్రసాద్, ఎస్ కరిముల్లా, విజయ్ కుమార్, చంద్రయ్య, అంకయ్య, గ్యారేజీ లో ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తున్న గోవిందరాజులతోపాటు ఓ ఏడీసీలను మంగళవారం డిపో మేనేజర్ ప్రశాంతి చేతులు మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ మంగమ్మ, యూనియన్ నాయకులు, ప్రతాప్, కార్మికులు పాల్గొన్నారు.

'సంక్షేమం'లో దొరవారిసత్రం ముందంజ

ప్రజాశక్తి -దొరవారిసత్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించడంలో దొరవారిసత్రం మండలం మొదటి స్థానాన్ని దక్కించుకుందని ఎంపీడీవో సింగయ్య తెలిపారు. డిజిటల్ అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవడంలో అన్ని పథకాలలోనూ దొరవారిసత్రం మొదటి స్థానం నిలిచి 100 శాతం సాధించిందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులకు,వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇతర సచివాలయ సిబ్బందికి, వాలంటీర్ల ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

వారాహి యాత్ర విజయవంతం కావాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ బుధవారం చేపట్టనున్న వారాహి యాత్ర విజయవంతం కావాలని, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ఆధ్వర్యంలో మంగళవారం వేదం కాళికాదేవి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి వారాహి యాత్రకి గోడపత్రికలను ఆవిష్కరించారు. వారాహి యాత్ర రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సష్టించబోతుందని చక్రధర్ అన్నారు. జన సైనికులు, వీర మహిళలు, నాయకులు, జనసేన శ్రేణులు సమిష్టిగా సమాలోచనలతో వారాహి యాత్రను విజయవంతం చేస్తామని చెప్పారు. చలపతి, రామయ్య, గురు, సురేష్, వెంకటేష్, శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ ఐలాకు ఐమాప్ పరిశ్రమ అంబులెన్స్ వితరణ

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ఐమాప్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత సీఎస్ఆర్ లో భాగంగా శ్రీసిటీ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ ఐలా కు రూ.29 లక్షల విలువైన నూతన అంబులెన్స్‌ను వితరణ ఇచ్చింది. మంగళవారం పరిశ్రమ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ తైజో ఇవామీ, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపిఐఐసి) జోనల్ మేనేజర్ చంద్రశేఖర్ కు అంబులెన్స్ తాళాలను అందజేశారు.

ఇంటర్ అడ్వాన్స్‌లో విక్రమ్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విడుదలైన జూనియర్ ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పట్టణంలోని విక్రమ్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎంపీసీలో మోక్షిత 470 మార్కులకు 465 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 3వస్థానం సాధించింది. ఎంఈసీ గ్రూపులో డింపుల్ 500 మార్కులకు 483 మార్కులు సాధించి పట్టణ స్థాయిలో ప్రథమస్థానం సాధించింది. సీఈసీలో స్వప్న ప్రియ 500 మార్కులకు 465 మార్కులు సాధించి కాలేజీ టాపర్ గా, బైపీసీలో సంధ్య 440 మార్కులకు 428 మార్కులు సాధించి కాలేజి ప్రథమస్థానం సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల డైరక్టరు డాక్టరు చంద్రశేఖర్, కరస్పాండెంట్ ముని లక్ష్మి అభినందించారు.

సిరుగురాజుపాలెంలో వైద్యసేవలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: సిరుగురాజుపాలెంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం 104 వైద్యసేవలు సర్పంచ్ మురళీమోహన్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ పంచాయతీలోని 104 వాహనంతో ఇంటింటికీ వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వైస్ సర్పంచి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు చదివే దివ్యాస్త్రం

-గూడూరు ఆర్డీవో ఎం. కిరణ్ కుమార్

ప్రజాశక్తి -గూడూరు: విద్యతోపాటే క్రమశిక్షణ.. సేవాభావం కలిగి ఉండాలని.. కష్టపడితేనే ఏ లక్ష్యాన్ని అయినా చేరుకోవచ్చని.. ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని చేరుకునేందుకు బాగా కష్టపడి ఇష్టంగా చదవాలని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి కష్టపడి చదివి మంచి స్థాయిలో రావాలనే లక్ష్యంతో కష్టపడి చదవాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదివినప్పుడే అత్యున్నతమైన స్థానాన్ని పొందుతారని తెలిపారు. సమాజంలో పేదరికాన్ని ఎదిరించాలంటే విద్య ప్రధాన మార్గమని. దీనికిమించిన మరో ఆయుధం లేదని.. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణతో పెంచి విద్యాబుద్ధులు నేర్పి సత్ప్రవర్తనతో మెలిగేలా పిల్లలకు దిశా నిర్దేశం చేయాలన్నారు. పాత శాలలో క్రమ శిక్షణతో విద్యను అభ్య సించడంతోనే నేడు తాను ఈస్థితిలో ఉన్నానన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. నేడు విద్య ప్రపంచీకరణ దిశగా సాగుతోందని, ఉన్నత చదువులు చదవడానికి విద్యార్థికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత స్థాయి ప్రమాణాలతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని.. విద్యార్థులకు నిస్వార్థంగా విద్యను అంది స్తోందన్నారు. చిన్నతనం నుంచి కష్టపడి చదివి విద్యార్థిగా ఈ స్థాయికి ఎదిగినట్లు వివ రించారు. విద్యార్థి వికాశం ఉపా ధ్యాయులపై ఆధారపడి ఉందని, వారు నేర్పే క్రమశిక్షణతో మాత్రమే విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహిం చగలరని తెలిపారు.

జగనన్న విద్యాకానుక విద్యార్థుకు వరం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న విద్యాకానుక విద్యార్థుకు ఓ వరమని.. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైతం మెరుగైన విద్యను అందించాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ రెడ్డి, ఎంఈవో రవీంద్రనాథ్, జడ్పిటిసి సభ్యురాలు ఆరని ప్రతిభారెడ్డి, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ ఉగ్గుమూడి సంధ్య, తహశీల్దారు హనుమంతనాయక్, ఎంపీడీవో నరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

వరదయ్యపాలెం: చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే పథకం జగనన్న విద్యా కానుక అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం వరదయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనీ విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీ చేశారు. పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని.. వారి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్‌లో బాలికలకు అడ్మిషన్లు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలిపారు. కళాశాలలో ఇంటర్ విద్యతోపాటు విద్యార్థినులకు కావాల్సిన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మండలంలోని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీసెల్ అధ్యక్షుడిగా పోలూరు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : టీడీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడిగా పోలూరు శ్రీనివాసులురెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి మంగళవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోలూరు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన సుధీర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాబోవు ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపుకోసం కషి చేస్తానని తెలిపారు.

పైపులైన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పురపాలక సంఘం పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు చోట్ల పైపులైను పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మంగళవారం పుత్తూరు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి పనులను పరిశీలించారు. జెండామాను వీధిలోని అమెనిటిస్ సెక్రటరీ, పురపాలక సంఘం ఏఈలను సంప్రదించి ట్యాప్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పార్కును పరిశీలించారు. పార్కులో మొక్కలను సంరక్షించడంలో సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణకి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన విభాగంలో 'రోల్ ఆఫ్ ఆశాస్ ఇన్ అచివింగ్ సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ రిలేటెడ్ టు విమెన్స్ హెల్త్ ఇన్ చిత్తూర్ డిస్టిక్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ "అనే అంశంపైన ప్రొఫెసర్ జయశ్రీ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినందున ఎస్. స్వర్ణ కి డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా విభాగాధిపతి, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

జయంతికి డాక్టరేట్..

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా విద్యా మహిళ అధ్యయన విభాగం పరిశోధక విద్యార్థి డి. జయంతికి డాక్టర్ ప్రదానం చేసినట్లు పరీక్షలు నియంత్రణ అధికారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన విభాగంలో "నాలెడ్జ్ అండ్ ప్రాక్టీసెస్ రిలేటెడ్ టు రీప్రొడక్టివ్ హెల్త్ అమాంగ్ అడలసెంట్ గర్ల్స్: యాన్ ఇంటర్వెన్షనల్ స్టడీ ఇన్ హైదరాబాద్" అనే అంశం పైన డాక్టర్ పి. నీరజ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినందుకు డి. జయంతికి డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగింది. ఈమె పలు జాతీయ అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి, సిబ్బంది, పరిశోధకులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పిల్లల భవిత

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చిన్నారుల భవిత అని.. చిన్నారులకు ఆట పాటలతో కూడిన ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి తెలిపారు. మంగళవారం కురింజలం అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తకాలు, అసైన్మెంట్లు ,వాట్సాప్‌లో వచ్చే రోజూ కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్థులు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కోట: పిల్లలకు ఆటపాటలతో విద్యాబోధన అందించాలని సీడీపీవో మునికుమారి తెలిపారు. మంగళవారం కోట ప్రాజెక్ట్ పరిధిలోని చిట్టేడు సెక్టార్‌లో ఊనుగుంటపాళెంలో ర్యాలీ నిర్వహించారు. 3 నుంచి 6 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలను అంగన్వాడీ స్కూల్‌కు పంపాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అంజమ్మ, అంగన్వాడీ సూపర్ వైజర్ కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వర్ణలత, శ్యామల, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం: నాగలాపురంలోని రెడ్డివీధిలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంగన్వాడీ కార్యకర్త విజయ మాట్లాడుతూ పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని కోరారు.

జర్నలిస్టులకు అన్యాయం చేస్తే సహించం

ప్రజాశక్తి-గూడూరు: నకిలీ విలేకర్లపై చర్యలు తీసుకోవాలని.. వారి ఎన్‌వోసీలు రద్దు చేయాలని కోరుతూ గూడూరు విలేకరులు మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం రెండోరోజుకు చేరుకున్నాయి. రెండోరోజు టీడీపీ, బీజేపీ, జనసేన, చిరంజీవి యువత నాయకులు దీక్షా శిబిరం వద్దకు చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాదిలాంటి మీడియా రోడ్డెక్కాల్సి రావడం దురదష్టకరమన్నారు. ఎమ్మెల్యే, కమిషనర్లు తక్షణమే సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, బీజేపీ, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది లాంటి మీడియా రోడ్డెక్కాల్సి రావడం దురదష్టకరమన్నారు. కమిషనర్ పరిధిదాటి వ్యవహరించడమే కాకుండా జర్నలిస్టులను బ్లాక్ మెయిల్ చేస్తుండటం తగదన్నారు. భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నర్రా సంజీవయ్యనాయుడు మాట్లాడుతూ నకిలీ జర్నలిస్టులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జనసేన పట్టణ అధ్యక్షులు ఇంద్రవర్ధన్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్‌పై రోజురోజుకూ అవినీతి ఆరోపణలు పెరిగిపోతున్నాయన్నారు. వెంటనే కమిషనర్ అవినీతిపై విచారణ జరిపి విలేకరులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చిరంజీవి యువత అధ్యక్షులు సయ్యద్ నయీం మాట్లాడుతూ ప్రజల పక్షాన పనిచేసే విలేకరులను అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు. సీనియర్ విలేకరి మీజూరు మల్లికార్జున్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, పిళ్లిళ్ల శ్రీనివాసులు, అమరయ్య నాయుడు, రావుల శివ ప్రసాద్ గౌడ్, చంద్ర మౌళి, నాటశేఖర్, సాయి, బీజేపీ నాయకులు సాంబయ్య, సురేష్, వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు విష్ణు, చిరంజీవి యువత ప్రతినిధి హసన్, శివ, సందీప్, నాగరాజు, మొహసిన్, వంశీ, కార్యదర్శులు సనత్, శంకర్, శివ, గని తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీవకుళమాత ఆలయ వార్షికోత్సవం



ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: తిరుపతి రూరల్ మండలం పేరూరు బండ (పాత కాల్వ)పై నిర్మించిన శ్రీ వకుళ మాత ఆలయ మొదటి వార్షికోత్సవ కార్యక్రమాలు మంగళవారం వేడుకగా జరిగాయి. ఉదయం పుణ్యాహవచనం, కలశ స్థాపన, కలశ పూజ, విశ్వక్షేనారాధన జరిపారు. అనంతరం సంకల్ప పూజ, అగ్ని ప్రతిష్ట, మహాశాంతి హోమం, పూర్ణాహుతి , అష్టోత్తర శత కలశ స్నపనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆగమ సలహాదారులు శ్రీ మోహన రంగా చార్యులు, శ్రీ సీతారామాచార్యులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్ దంపతులు, జేఈవో వీరబ్రహ్మం, ఆర్డీవో కనక నరసారెడ్డి, ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

అమ్మకు కానుక

శ్రీ వకుళ మాత ఆలయ తొలి వార్షికోత్సవం సందర్భంగా తిరుమల నుండి ఆమె కుమారుడు శ్రీ వేంకటేశ్వర స్వామి 160 గ్రాముల బరువైన రెండు బంగారు హారాలు కానుకగా పంపారు. శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం ఈ ఆభరణాలను తీసుకొచ్చి జేఈవో వీరబ్రహ్మంకు అందజేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో జేఈవో ఈ ఆభరణాలను ఆలయానికి అందించారు. మంత్రి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

వీరభద్రస్వామి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలో ఉన్న శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారికి విశేష పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. దాతలుగా పంటా శ్రీనివాసులు రెడ్డి , అపర్ణ దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ తుమ్మూరు మునిమోహన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట మండల పరిధిలోని గురవరాజుపల్లి సర్కిల్ వద్ద మంగళవారం వెంకటగిరి నుంచి తిరుపతి వైపు వస్తున్న వెళ్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనంలో వెళ్తున్న శ్రీకాళహస్తిలోని కొండమిట్టకు చెందిన కళ్యాణ్(23)ను ఢీకొంది. ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో ఫ్లెక్సీల వివాదం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ బస్టాండ్ వద్ద బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి తెరలేపింది. మూడు రోజుల క్రితం టీడీపీ నాయకులు ఏర్పాటు చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఫ్లెక్సీ అలాగే ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని కొన్ని వార్తా పత్రికల్లో వచ్చిన కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఫ్లెక్సీని అరగంటలో తీసేయాలని.. లేకుంటే ఫ్లెక్సీలు చించేస్తామని టీడీపీ నాయకులకు హుకుం జారీచేశారు. ఫ్లెక్సీలు తొలగించాలంటే తాను ఊర్లో లేనని.. వేరేవారికి చెప్పానని.. తీసేస్తామని చెప్పిన క్షణానికే పంచాయతీ కార్యదర్శి రెచ్చిపోయాడు. కాస్త సమయం కావాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు కోరగా.. సమయం లేదని అతనిపై దుర్భాషలాడుతూ వ్యక్తిగత విమర్శలు చేస్తూ నెట్టడంతో కోపంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. టీడీపీ మండల అధ్యక్షుడు పార్టీ శ్రేణులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక పంచాయతీలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ రాజకీయ అండ చూసుకుని ప్రజలపై తిరుగుబాటు చేస్తున్న సుబ్బారావుపై ఇదివరకే ఫిర్యాదు చేశామని.. అది మనసులో పెట్టుకుని వ్యక్తిగతంగా తనపై చెయ్యి చేసుకుని స్టేషన్లో ఫిర్యాదులు చెయ్యడం అన్యాయమని.. ఇలాంటి ప్రభుత్వ ఉద్యోగులని వెంటనే సస్పెండ్ చెయ్యాలని మండల అధికారి కార్యాలయం వరకు ధర్నా చేపట్టారు. మండల అధికారికి పిర్యాదు చేసినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై మంజునాథరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను విచారించి సమస్యకు పరిష్కారం చూపుతామని.. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదని హెచ్చరించారు. అనంతరం టిడిపి నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో ధర్నా నిర్వహించి ఎంపీడీవో డీవీ నరసింహారావుకు పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి డాక్టర్ హెలెన్, గ్రంథాలయ ఛైర్మన్ మాజీ కన్నయ్య నాయుడు, ఎంపీటీసీ మనోహర్‌నాయుడు, ముని నాయుడు, భాస్కర్‌యాదవ్, రమణయ్యయాదవ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-క్యాంపస్: 2023-2024 విద్యా సంవత్సరానికి గాను జాతీయ స్థాయిలో జరిగిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఇతర రాష్ట్రాల మెరిట్ లిస్టు ఫలితాలలో తిరుపతి విశ్వం విద్యా సంస్థల విద్యార్థులు సంచలన ఫలితాలు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో ఎం.నవదీప్ ప్రథమ ర్యాంకును, ఏ.కరణ్,టీ.దినేష్,కే.పూజిత్, పీ.అజయ్ కుమార్ లు రాష్ట్ర స్థాయిలో 10 లోపు 6 ర్యాంకులు సాధించారు. వీరితో పాటు కే.హర్షిత్, ఎన్.తనీష్, ఎస్.వర్షిణి, యోగ ప్రియ, విష్ణు స్వరూప్, యశ్వంత్, ఎ.నిషాంత్, హేమ సాయి, భగత్, చరణ్, హర్షిత్, గణేష్, సాగర్, నితీష్ రెడ్డి, సూర్య, హేమంత్, తనుష్, శశాంక్, జ్యోతి, లక్ష్మి సాయి తదితరులు రాష్ట్ర స్థాయి సైనిక్ స్కూల్ కలికిరి, కోరుకొండ, బీజాపూర్, కొడగు, భువనేశ్వర్, అమరావతి నగర్, చంద్రపూర్ తదితర సైనిక్ స్కూల్లో మొత్తం 54 మంది విశ్వం చిన్నారులు ఎంపిక కావడంతో పాటు ఆరో తరగతి గణితంలో 150/150 మార్కులు, 9వ తరగతి గణితంలో 200/200 మార్కులు, ఇంటలిజెన్స్ 50/50 మార్కులు సాధించడం మన రాష్ట్ర విద్యాశాఖ గర్వకారణమని విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలియజేశారు.

దుకాణంలోకి పాము

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: స్థానిక ఎల్ఐసీ సమీపంలోని ఓ దుకాణంలోకి ఆరడుగుల పాము దూరడంతో యజమాని భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అటవీ శాఖ సిబ్బందికి, స్నేక్ క్యాచర్ శ్రీకాంత్‌కు సమాచారం అందించడంతో దుకాణం వద్దకు చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE: TIRUPATI

E.A.NO. 206/2022, E.P.NO. 06/2019
O.S.NO. 126 OF 2015

L.R.Mohan Kumar Reddy ..Claim Petitioner
V/s
K.Dharani Krishna ...Respondent/D.Hr
K.Leela Prasad
K.Latha ...Respondent/J.Drs No.1 and 2

NOTICE TO RESPONDENT No.2/J.Dr No.1

Sri K.Leela Prasad, S/o Late Subba Ramudu @Chitti Raju, Hindu aged about 37 years, Residing at Flat No.47, D.No.2-147, T.T.D Plots, Srilakshmi Nagar, M.R.Palle, Tirupati, Tirupati District.

Please take notice that the Claim Petitioner filed the above petition against you and the same is posted for your appearance. So, you are hereby called upon to appear before the Hon'ble Court on 26-06-2023 at 10.30 a.m., failing which the matter will be decided exparte.

Hearing Date: 26-06-2023
//'by order of court//

VELLORE BHASKAR
Advocate for Claim Petitioner, Tirupati